క్లుప్తంగా

6న మండల సమావేశం

రైల్వేకోడూరు అర్బన్ : మండల సర్వసభ్య సమావేశం ఆగస్టు 6 మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక సభా భవనంలో నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపీడీఓ కేవీ సుబ్రమణ్యం తెలిపారు. మండలాధ్యక్షురాలు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని తెలియజేశారు.

మొక్కుబడిగా గ్రీవెన్స్ సెల్

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్) తూతూమంత్రంగా సాగింది. డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నిశాఖల అధికారులు హాజరుకావాల్సి ఉన్నా కేవలం ఎవరూ హాజరు కాకపోవడంతో ఆర్ఐతోనే సరిపెట్టారు. కేవలం రెండు అర్జీలు విద్యుత్ మీటర్ల కొరకు వచ్చాయన్నారు. గతంలో స్పందన కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు హాజరై పలు సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించేవారు.

అర్జీలను పరిష్కరించాలి

పుల్లంపేట : ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని పుల్లంపేట తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న తెలియజేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా వీఆర్ఏలు, వీఆర్ఓలు అందుబాటులో ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లు పలు ధృవీకరణ పత్రాలు విద్యార్థులకు, ప్రజలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ స్వాతి, వీఆర్ఓ శోమశేఖర్ రెడ్డి, మల్లి, రాధమ్మ, ధనమ్మ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

సంబేపల్లి : మండల పరిధిలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయానికి వెళ్లే మార్గానికి సోమవారం పంచాయతీరాజ్ డీఈ వెంకట్ రెడ్డి, జేఈ మహబూబ్‌సాబ్‌లు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో దాదాపు రూ.కోటి 26 లక్షలతో పాలెంగడ్డ బీటీ రోడ్డు నుంచి నల్లగంగమ్మ ఆలయం చుట్టూ సీసీ రోడ్డు మంజూరైందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కొండారెడ్డి, మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, వేణుగోపాల్ నాయుడు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి కాపాడండి

రాయచోటి టౌన్ : పట్టణ పరిధిలోని బిజిలీ గుట్ట సమీపంలో 1997 సంవత్సరంలో ఇంటి పట్టాలు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై ఆక్రమణదారుల కన్ను పడిందని దీనిని కాపాడి అర్హులైన వారికి అందించాలని కోరుతూ వడ్డెర సంఘం నాయకుడు ఇడగొట్టు నాగేశ్వరావు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు.

గ్రామాల్లో పూడికతీత పనులు

రామాపురం : ఈఓపీఆర్డీ ఉషారాణి ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని సరస్వతి పల్లె పంచాయతీలో సర్పంచ్ మునీర్‌బాషా, పంచాయతీ సెక్రటరీ సూరం సంజీవ రెడ్డిల ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. అనంతరం వీధుల్లోని చెత్త, చెదారం, గ్రామాలకు ఆనుకొని ఉన్న దిబ్బలు, కంపచెట్లను తొలగించి బ్లీచింగ్ సున్నంను చల్లించారు. కార్యక్రమంలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోండి

రాయచోటి టౌన్ : రైల్వేకోడూరులో గుర్తింపు లేకపోయినా నిర్వహిస్తున్న పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెల్యూషనరీ ఆర్ఎస్‌యూ నేతలు సోమవారం విద్యాశాఖ ఏడీ ప్రసాద్ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి వంశీరెడ్డి మాట్లాడుతూ అనుమతులు, గుర్తింపు లేకుండా పాఠశాలలను నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. అంతే కాకుండా ఆ పాఠశాల నిర్వహణ ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉందని అలాంటి భవనంలో ఎలా తరగతులు నిర్వహిస్తారో అధికారులకే తెలియాలన్నారు. అయినా పాఠశాల నిర్వాహకులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి తమకు అన్ని రకాల అనుమతులున్నాయని మా పాఠశాలలోనే చేరాలని విద్యార్థులకు చెప్పడం చూస్తే ఆశ్చర్యమేస్తోందన్నారు. ఆ పాఠశాలలను తనిఖీ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

సమాజానికి దిశా నిర్దేశకులు ఉపాధ్యాయులే

సుండుపల్లె : ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ వెంకటేష్ నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తిమ్మసముద్రం పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు షేక్ ఆరిపుల్లా ఆధ్వర్యంలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన సుధాకర్ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరిపుల్లా, ఎంఈఓ రవి నాయక్, కాంప్లెక్స్ హెచ్ఎం అబీదుల్లా, రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుపై స్పష్టతేదీ?

- ప్రకృతి విపత్తు జరిగితే సర్వం కోల్పోనున్న రైతన్నలు
- పంట రుణాలకూ ఇ– క్రాపే ఆధారం
- పంట నమోదు చేపట్టకపోవడంతో ఆందోళనలో రైతన్నలు


ఇ - క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

సంబేపల్లి : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు పంటనమోదుపై ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్నదాత పరిస్థితి అయోమయంగా మారింది. టీడీపీ ప్రభుత్వ తీరుతో మళ్లీ ఇబ్బందులు తప్పవా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు రైతులు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ అన్ని విధాల రైతులకు అండగా నిలిచింది. రైతుల ముంగిట సేవలు అందజేసేందుకు సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సీజన్ ముందే పెట్టుబడి సాయం అందజేయడంతోపాటు ఇ - క్రాప్ నమోదు చేయించి రైతన్నను అన్ని విధాలుగా ఆదుకుంది జగన్ ప్రభుత్వం. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శలు మొదలయ్యాయి. ప్రత్యేకంగా ఇ - క్రాప్ నమోదు చేపట్టకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించే రాయితీలు, నష్ట పరిహారాలు కోల్పోవాల్సిందేనని ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ జూన్ 1 నుంచి ప్రారంభమవ్వగా సంబేపల్లె మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాధారణ సాగు దాదాపు 2500 ఎకరాల సాగు భూమి ఉండగా, 950 ఎకరాలలో వేరుశనగ, వరి, కంది, అలసంద, ఉలవ తదితర పంటుల రైతులు సాగు చేశారు. ఆయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఇ - క్రాప్ నమోదు ఊసేలేదు. పంట నమోదుపై టీడీపీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో అసలు పంట నమోదు చేస్తారా లేదా అనే ఆందోళన రైతులలో నెలకొంది.


ఖరీఫ్ సీజన్‌లో సాగులో ఉన్న కంది


రైతులు సాగు చేసిన వేరుశనగ

గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా..

గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఇ – క్రాప్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇ– క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసింది. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే పంట నమోదు ప్రక్రియను ప్రారంభమయ్యేది. ఆర్బీకే వ్యవసాయ సహాయకులు రైతులు పండించిన పంటను ఇ - క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు చేసేది. ప్రభుత్వం నుంచి మద్దతు ధర లభించేది. ప్రకృతి వైపరీత్యాల వలన పంట దెబ్బతింటే సీజన్ పూర్తయ్యే లోపల పరిహారం అందించేందుకు ఈ క్రాప్ ఎంతగానే ఉపయోగపడేది.

పంటల నమోదు వలన ప్రయోజనాలు..

1.పంట రుణాలు మంజూరవుతాయి
2.పంటల బీమా వర్తిస్తుంది
3.ఇన్‌పుట్ సబ్సిడీ, పంట
4.నష్టపరిహారం అందుతుంది
5.పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించుకోవచ్చు
6.సున్నావడ్డీ అమలవుతుంది. ఎరువులు, పురుగుల మందులు తక్కువ ధరకే లభిస్తాయి
7.వ్యవసాయ యంత్ర పరికరాలు, పెట్టుబడి సాయం, ఉచిత బోర్లు మంజూరయ్యేవి

రైతులను ఆదుకోవాలి



రైతులను టీడీపీ ప్రభుత్వం ఆదుకోవాలి గత ప్రభుత్వం లాగానే పెట్టుబడి సాయం అందజేయాలి. పెట్టుబడి సాయం అందజేయకపోవడం మంచిది కాదు. ఇ - క్రాప్ నమోదు విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలి. ఉన్నతాధికారుల వెంటనే స్పందించి పంట నమోదు చేసేలా ఆదేశాలు జారీచేయాలి. రైతులకు ప్రభుత్వం మేలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు యాదవ్, రైతు, సంబేపల్లె

మార్గదర్శకాలు రాలేదు

ఇ – క్రాప్ నమోదుకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఇంతవరకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. రైతులకు సంబంధించి సహకారం అందజేస్తాం. మార్గదర్శకాలు వచ్చిన వెంటనే ఇ – క్రాప్ నమోదు కార్యక్రమం చేపడతాం.

– వ్యవసాయ అధికారులు

గాలేరు - నగరి నీటిని అందించాలి

చిట్వేలి : రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు గాలేరు – నగరి ప్రాజెక్టును పూర్తి చేసి నీరు అందించాలని రాష్ట్ర రైతు సంఘం నాయకులు మలిశెట్టి రాహుల్ విజ్ఞప్తి చేశారు. సోమవారం వెంకట్రాజుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణంగా ఈ నియోజకవర్గాలలో అక్టోబర్, నవంబర్ నెలల్లో వర్షాలు పడతాయి, జూన్, జూలై నెలల నుండి ఈ ప్రాంతంలో సాగు, తాగునీటికి కొరత ఏర్పడుతుందన్నారు. ఇదే సమయంలో గోదావరి, కృష్ణా నదులు ప్రవహిస్తుంటాయని ఈ ప్రాంతంలోని చెరువులను నీటితో నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి సాగు, తాగునీటి కొరత తీరుతుందన్నారు. ప్రభుత్వం త్వరగా గాలేరు – నగరి ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి నీరు అందించాలని రాహుల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మలిశెట్టి వెంకటయ్య, నారాయణ, వెంకటసుబ్బయ్య, వెంకటయ్య, చలపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అడవులను రక్షించాలి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఒంటిమిట్ట అటవీశాఖ సిబ్బంది అంతర్జాతీయ పులుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడవులను రక్షించాలని, అడవి జంతువులకు హాని కల్గించకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీశాఖ సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు వీపీఎస్ ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

రామాపురం : మండలంలోని రాచపల్లి గ్రామం గంగనేరులో గత కొంతకాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన ప్రత్యేక నిధులతో ఆ గ్రామానికి బోరు వేయించాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి సోమవారం బోరు పనులు ప్రారంభించారు.

మండలాభివృద్ధికి పాటుపడదాం


నాయకులతో కలిసి సమావేశానికి వస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

వీరబల్లి : మండలాభివృద్ధికి అందరం కలిసికట్టుగా పాటుపడదామని రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథరెడ్డి తెలిపారు. సోమవారం వీరబల్లి మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో అభివృద్ధి సాధించుటకు కొంత సమయం పడుతుందన్నారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు అందరం కలిసి గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను తీర్చేందుకు కృషి చేద్దామన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో మండలంలో రైతులకు పంటలు వేయడానికి సరైన వర్షాలు పడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరిని ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రైతు భరోసా సాయాన్ని రైతులకు ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం త్వరగా రైతుల ఖాతాలలో జమ చేస్తే వ్యవసాయ ఖర్చులకు ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు గ్రామాలలో ప్రబలుతున్నాయని, వాటిపట్ల ఆరోగ్య సిబ్బంది ముందు జాగ్రత్తలు తీసుకొని గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యం అందించాలన్నారు. తమకు ఓట్లువేసి గెలిపించినందున ప్రజలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు శివరాం, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి పాటుపడదాం

వీరబల్లి : మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసికట్టుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడదాం, జగనన్నకు తోడుగా ఉందామంటూ రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన వీరబల్లి మండలానికి విచ్చేసిన సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి నివాసంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఎవరూ అధైర్యపడకుండా ధైర్యంగా ఉంటూ కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ జగనన్నకు తోడుగా నడుద్దామన్నారు. మండలంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వీరబల్లి మండల పార్టీ నాయకులకు, అభిమానులకు, కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. జగనన్న ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ

రాజంపేట : పట్టణంలోని 13 సచివాలయాల సిబ్బంది ద్వారా వచ్చేనెల 1న పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనరు రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు సచివాలయం, మున్సిపాలిటీకి రావాల్సిన అవసరం లేదన్నారు. మీ వద్దకు సచివాలయ సిబ్బంది వచ్చి పింఛను ఇస్తారని, సహకరించాలని కోరారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు పింఛన్లు పంపిణీ జరుగుతుందన్నారు.

ఒకటో తేదీ ఉదయం నుంచి పింఛన్లు

పుల్లంపేట : ఆగస్టు ఒకటో తేదీ ఉదయం నుంచే ఆయా గ్రామ సచివాలయాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం బ్యాంకులలో నగదు జమ చేసిందని, మంగళ, బుధవారాలు నగదు డ్రా చేసుకొని గురువారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. మండల వ్యాప్తంగా 5111 పింఛన్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఓ ఖాన్, ఈఓపీఆర్డీ పెంచలయ్య, పంచాయతీ కార్యదర్శులు శివశంకర్, ముత్తయ్య, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.


పుల్లంపేట: పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ

పంట దిగుబడి పెంపొందించడమే లక్ష్యం

రామాపురం : కొత్త రకాలు, నూతన వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ మంచి దిగుబడి పెంపొందివచ్చని సహాయ సంచాలకులు డాక్టర్ సుమతి అన్నారు. సోమవారం మండలంలోని గోపగుడిపల్లె గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు పొలంలో కె.వి.కె ఊటుకూరు కడప ద్వారా జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా వేరుశనగ సామూహిక ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శనను ఆమె సందర్శించడం జరిగింది. మాట్లాడుతూ కొత్త రకాలు నూతన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి పెంపొందించాలనేదే సామూహిక ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శన లక్ష్యమన్నారు. అలాగే రైతులు నాణ్యమైన విత్తనాన్ని ఉత్పత్తి చేసి వాటిని రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా విక్రయం చేపట్టడం వలన రైతులకు అధిక ధర లభిస్తుందని తెలిపారు. వర్షాధారిత వేరుశనగలో పొటాష్ వినియోగం మీద క్షేత్ర పరిశీలన చూస్తూ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి వారు అందజేస్తున్న పరిశోధన ఫలితాలను రైతు స్థాయిలో ప్రదర్శించడం వలన నూతన యాజమాన్య పద్ధతులపై రైతులు మొగ్గు చూపే అవకాశం ఉంటుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, సలహాలు అందించడంలో విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. సదా వారి సేవలు అందుబాటులో ఉంటాయని వాటిని వినియోగపరచుకోవాలని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త వీరయ్య, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ శిల్పకళ, డాక్టర్ కే సాయి మహేశ్వరి, వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, వీఏఏ, గోపగుడిపల్లి రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో పొద్దుతిరుగుడు విత్తనాలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట రైతు సేవా కేంద్రంలో రైతులకు పొద్దుతిరుగుడు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సోమవారం మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. అవసరమైన రైతులు ముందుగా వేలి ముద్రవేసి విత్తనాల కోసం నమోదు చేసుకొని అవసరమైన పత్రాలను సమర్పించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధికి అందరూ సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

రామాపురం : ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేసి మండల అభివృద్ధి చేయాలని ఎంపీపీ గడికోట విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిషత్ సభా భవనంలో మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతనలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ అన్ని గ్రామాలతోపాటు మండల కేంద్రంలో అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని, ముఖ్యంగా సాగునీరు, విద్యుత్, అనారోగ్య పరిస్థితుల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సిద్ధేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 35 చౌక దుకాణాలు ఉండగా అందులో 23 పర్మనెంట్ కాగా, 12 తాత్కాలిక దుకాణాలు ఉన్నాయన్నారు. డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వస్తున్నాయని, శిబిరాలు నిర్వహించి రోగులకు మందులు అందజేస్తున్నామన్నారు. ఎంఈఓ జయచంద్ర మాట్లాడుతూ 33 పాఠశాలలో నాడు – నేడు కింద పనులు జరిగాయని, అందులో 50శాతం వరకు పనులు పూర్తిచేయగా మిగిలిన పనులు నిధులు లేక ఆగిపోయాయని తెలియజేశారు. ఏపీఓ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, పని కావాల్సిన వారికి పనులు కల్పిస్తామని తెలియజేశారు.

గ్రామాలలో పశువులకు, మేకలు, గొర్రెలకు నీరు నాలుక వ్యాధి, గాలికుంటు వ్యాధులు ప్రబలి అధిక సంఖ్యలో మూగజీవాలు మరణిస్తున్నాయని సమావేశంలో పలువురు సభ్యులు సభా దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న పౌష్టికాహారం అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హుసేనమ్మ తెలిపారు. నీలకంఠ్రావుపేటలో విద్యుత్ స్తంభాలు మంజూరై ఏడాది కావస్తున్న ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్లేదని, చిట్లూరు గ్రామ పంచాయతీ పాలన్నగారిపల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై ఏడాది కావస్తున్న ఇంతవరకు ఏర్పాటు చేయలేదని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి పల్లెకు ఆర్టీసీ సర్వీసులు కల్పిస్తామని ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు రాయచోటి డిపో పరిధిలోని అన్ని గ్రామాలకు రోడ్డు సర్వే నిర్వహించి ప్రయాణికులు ఉన్న ప్రతి చోటుకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటరమణ, మండల ఉపాధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి(బాబు), సర్పంచ్ అయోధ్యపురం నాగభూషన్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్, డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వరరావు, డాక్టర్ వినోద్‌కుమార్, ఎంఈఓలు జయచంద్రుడు, రామకృష్ణుడు, ఏఓ నాగమణి, చంద్రబాబుల్‌రెడ్డి, ఏపీఓ సురేంద్రనాధరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నింటికన్నా విలువైనది విద్య

రాయచోటి టౌన్ : అన్నింటికన్నా విలువైనది విద్య ఒక్కటేనని డైట్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి అన్నారు. సోమవారం రాయచోటి లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి వారి ఆధ్వర్యంలో విద్యా వారోత్సవాలలో భాగంగా విద్య అవగాహన సదస్సుతోపాటు విద్యార్థులకు అన్నదానం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య అనేది ఒక ఆయుధం లాంటిదని చెప్పారు. డబ్బు, బంగారు వంటి అత్యంత విలువైన వస్తువుల కన్నా విలువైనది విద్యేనన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదవి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీఎంటీ కో ఆర్డినేటర్ లయన్ పీఎస్ హరినాథరెడ్డి, ప్రసాద్ నాయుడు, షేక్ మహమ్మద్, షేక్ ఇందాద్ అహమ్మద్, కిశోర్ కుమార్‌రెడ్డి, షేక్ చాన్ బాషా, శ్యామ్, వినోద్‌కుమార్‌నాయక్, సిబ్బంది రెడ్డెప్పరెడ్డి, శివభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏజీ గార్డెన్ ప్రజల సమస్యలు పరిష్కరించాలి



సీపీఐ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న ఏజీ గార్డెన్ ప్రాంత ప్రజలు

రాయచోటి (జగదాంబ సెంటర్) : ఏజీ గార్డెన్ ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుక్కే విశ్వనాథనాయక్ ఏజీ గార్డెన్ ప్రజలతో కలిసి కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విశ్వనాథనాయక్ మాట్లాడుతూ ఏజీ గార్డెన్ కాలనీలో దాదాపు 1600 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. వారికి కనీసం తాగడానికి నిరుపేద విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ సెంటర్లు, సీసీ రోడ్లు లాంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడం ప్రభుత్వాల అసమర్థత అని తెలిపారు. వెలిగల్లు నీటిపథకాన్ని ఏజీ గార్డెన్ ప్రజలకు అందజేయాలని డిమాండ్ చేశారు. అలానే కాలనీలో ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ సెంటర్లు, సీసీ రోడ్లు, వీధి దీపాలు వేయాలని డిమాండ్ చేశారు. అనునిత్యం కూలీనాలీ వలసలకు వెళ్తూ జీవనం సాగించేటువంటి ఏజీ గార్డెన్ ప్రజలకు ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే సీపీఐ నేతృత్వంలో నిరాహార దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు, ఏజీ గార్డెన్ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు


చిట్వేలి: తిథి భోజనం వడ్డిస్తున్న దృశ్యం


సిద్దవటం: జెడ్పీ హైస్కూల్లో...


చిన్నమండెం: భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారంరోజుల పాటు జరిగిన శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారంతో ముగిసిందని పాఠశాల హెచ్ఎం శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ కార్యక్రమం చివరి రోజు కొంత మంది దాతల సహాయంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యార్థినీ, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సిబ్బందికి తిథి భోజనం ఏర్పాటు చేశామన్నారు.

సంబేపల్లె : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం దాతల సహకారంతో తిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుద్యాల, శెట్టిపల్లె, దేవపట్ల, నాగిరెడ్డిగారిపల్లె, మోటకట్ల, నారాణరెడ్డిపల్లె, మోటకట్ల, రౌతుకుంట, సంబేపల్లె, గున్నికుంట్ల, గురిగింజకుంట, గున్నికుంట్ల, ఎస్.సోమవరం తదితర గ్రామాలలోని పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు చికెన్, వివిధ రకాల నాణ్యమైన భోజనాన్ని అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటి (జగదాంబ సెంటర్) : పండుగలు, వార్షికోత్సవాలు, పుట్టినరోజులు, పెళ్లిరోజు వంటి శుభ కార్యాల సందర్భంగా సమాజంలోని దాతల సహకారంతో విద్యార్థులకు తిథి భోజనం అందిస్తున్నామని ఏడీ ప్రసాద్‌బాబు అన్నారు. సోమవారం శిక్షసప్తాహ్ కార్యక్రమం ముగింపు సందర్భంగా రాయచోటి మండలం దఫేదార్‌పల్లి అప్పర్ ప్రైమరీ ఉర్దూ స్కూల్ విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ షౌకత్ విద్యార్థులందరికీ రుచికరమైన భోజనం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, ఐఈ కోఆర్డినేటర్ జనార్దన్, ఏఏఎంఓ సమీవుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని పాఠశాల చైర్మన్ సలీం అన్నారు. సోమవారం మండలంలోని నీలకంఠ్రావుపేట ఉర్దూ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అతిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు.

చిట్వేలి : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తిథి భోజనం వడ్డించామని ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి తెలిపారు. దాత రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహా మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అరటిపండు, పాయసం వడ్డించారు. అదే విధంగా దాతలు ముందుకు వస్తే ప్రతిరోజూ విద్యార్థులకు తిథి భోజనం అందిస్తామన్నారు. దాతలు ఈ విషయాన్ని ముందురోజు తమకు తెలియజేయాలని ప్రధానోపాధ్యాయులు కోరారు.

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శివానాయక్ తెలిపారు. సోమవారం విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్యా కమిటీ చైర్మన్ బెల్లం బయారెడ్డి, మాజీ సర్పంచ్ చింతం వెంకట్రామిరెడ్డిల దాతృత్వంలో విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె : ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గంగిరెడ్డిగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యాయులు హుస్సేన్ బాషా, రామ్మోహన్‌లు తెలిపారు. గ్రామానికి చెందిన తుమ్మల మల్‌రెడ్డి, గ్రామస్తుల సహాయంతో సోమవారం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.